# తరలివచ్చి ఓటేసి..

- గత ఎన్నికల కంటే పెరిగిన ఓటింగ్ శాతం
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..
- ఇక లెక్కింపే తరువాయి

బోథ్, మే 14 : ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో బోథ్ నియోజకవర్గం పరిధిలో 78.16 శాతం పోలింగ్ నమోదైంది. 2,11,313 ఓటర్లకు గాను లక్షా 65,157 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 9 మండలాల పరిధిలోని 306 పోలింగ్ కేంద్రాలకు గాను పది పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రం–45 అంబుగాంలో 90.30, 62 సాకినపూర్ 90.19, 69 షేకు గూడలో 90.58, 72 రత్నపూర్‌లో 92.06, 75 కోసాయిలో 92.54, 77పల్సి(బీ)లో 90.37, 140 అడెగాం(బీ)లో అత్యధికంగా 93.36, 156 సల్యాదలో 93.35, 168/ఏ జోగిపేటలో 93.33, 277 గాజిలీలో 91.25 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా ఇచ్చోడలోని పోలింగ్ కేంద్రం–131లో కేవలం 58.33 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది.

## గెలుపుపై అన్ని పార్టీల ధీమా

ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల కోసం సోమవారం జరిగిన పోలింగ్ సరళితో అన్ని పార్టీలు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. బోథ్ నియోజకవర్గం పరిధిలో తమ కంటే తమకే ఆధిక్యత వస్తుందని బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గం పరిధిలోని 9 మండలాలకు గాను మొత్తం 2,11,313 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో లక్షా 65,157 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 78.16గా నమోదైంది. పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లను లెక్కలు వేసుకుంటూ మూడు పార్టీల నాయకులు తమకే ఆధిక్యత లభిస్తుందని చర్చించుకుంటున్నారు.



ఓటు వేసేందుకు క్యూలో నిలబడ్డ ఓటర్లు

## తాంసిలో

తాంసి, మే 14 : మండలంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిశాయి. అయితే మండలంలో 17 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 13,598 ఓటర్లు ఉండగా 11,167 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని బాధ్యతను నెరవేర్చారు. ఇక లెక్కింపే తరువాయి. ఓటింగ్ శాతం పెరగడంతో ఇది ఎవరికి అనుకూలం, ఎవరికి ప్రతికూలమన్న చర్చలు సర్వత్రా నడుస్తున్నాయి. ఓ వైపు అధికార పక్ష నేతలు, మరోవైపు ప్రతి పక్ష నాయకులు అందరూ కూడా ఎవరికి వారు తమ గెలుపుపై ధీమాతో కనిపిస్తున్నారు.

## ఖానాపూర్‌లో 72.20 శాతం

ఉట్నూర్, మే14 : ఖానాపూర్ నియోజకవర్గంలో 72.20 శాతంగా ఓటింగ్ నమోదైంది. అదే గత సంవత్సరం శాసనసభ ఎన్నికలను పరిశీలిస్తే నియోజకవర్గంలో 77.46 శాతంగా నమోదైంది. అంటే ఈసారి ఓటర్ నమోదుకాగా ఈసారి 5.26 తగ్గింది. ఇక ఖానాపూర్ నియోజకర్గంలో పురుషుల ఓట్లు 76వేల 926, మహిళా ఓట్లు 85,171, ఇతరులు 4 మొత్తం1లక్షల 62వేల101 ఓట్లు ఉన్నాయి. అందులో పురుషులలో 70.13 శాతంగా, మహిళలలో 74.17శాతంగా, ఇతరులలో 30.77 శాతంగా మొత్తంగా పరిశీలిస్తే 72.20 శాతంగా నమోదైంది. ఇక ఆదిలాబాద్ పార్లమెంట్‌లోని నియోజక వర్గాల వారిగా పరిశీలిస్తే సిర్పూర్‌లో 71.56, ఆసిఫాబాద్‌లో 75.49గా, ఆదిలాబాద్‌లో 73.89 శాతంగా, బోథ్‌లో 78.16 శాతంగా, నిర్మల్‌లో 71.68 శాతంగా, ముధోల్‌లో 75.63 శాతంగా నమోదైంది. అత్యదికంగా బోథ్‌లో 78.16 ఓటింగ్ నమోదు కాగా, అత్యల్పంగా సిర్పూర్‌లో 71.56 ఓటింగ్ నమోదైంది.

## గుడిహత్నూర్‌లో 80శాతం

గుడిహత్నూర్, మే 14 గుడిహత్నూర్ మండలంలో పార్లమెంటు ఎన్నికల్లో 80 శాతం పోలింగ్ జరిగింది. మండలంలో మొత్తం24,854ఓట్లకు 19,594 పోలయ్యాయి.కమలాపూర్ పంచాయతీలో 598కి 518, వైజాపూర్‌లో 706కు 611,సీతాగోందిలో 986కు807,గర్కంపేట్ 403కు341,మల్కాపూర్ 379కు340 ఓట్లు పోలయ్యాయి.లింగాపూర్673కు542,మాన్కాపూర్617కు 540, తోషం 2341కు 1850, రాగాపూర్335కు 280, తోషంతాండ 617కు 459, మచ్చాపూర్ 941కు750, గుడిహత్నూర్ 5358కు 3783 ఓట్లు పోలయ్యాయి. ముత్నూర్ 822కు 577,ముత్నూర్‌తాండ 499కు 400, ధమన్‌గూడ 381కు305, కొల్హారిలో 1875కు 1562,డొంగర్‌గామ్ 464కు 406,ఉమ్రి బి 271కు240,సూర్యగూడ 556కు 455,సోయంగూడ161కు150,శాంతాపూర్ 950 కు 763,గోండ్‌హర్కాపూర్ 482కు 384,బెల్లూరి337కు 302,గురుజ 777కు 612,మన్నూర్ 2750కు 2134, శంభుగూడ 575కు483 ఓటరులు ఓటు వినియోగించుకున్నారు.

## భీంపూర్‌లో..

భీంపూర్, మే14: మండలంలో సగటున పోలింగ్ శాతం 79.25. కాగా కామట్‌వాడలో అత్యధికంగా 87.39 పోలింగ్ శాతం నమోదయింది. తరువాత వడ్‌గాం 87.26. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికలకు దూరంగా ఉండి ఇపుడు పోలింగ్‌లో పాల్గొన్న గొల్లగడ్‌లో 79.01 శాతం నమోదయింది. గోముత్రి, భగవాన్‌పురా, నిపాని ,పిప్పల్ కోటి, బేల్సరిరాంపూర్ , గుంజాల, మర్కాగూడ తదితర గ్రామాల్లో పోలింగ్ 80 శాతం దాటింది. వడూర్‌లో 74శాతం పోలింగ్ అయింది. మొత్తంగా 19,133 ఓటర్ల నుంచి 15,163 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## ఇనుప కడ్డీలను తొలగించిన అధికారులు



నాడు ప్రమాదకరంగా ఉన్న ఇనుప కడ్డీలు



నేడు తొలిగించిన అధికారులు

కుంటాల, మే, 14 : ఇటీవల మండల కేంద్రంలోని 11వ వార్డులోని ఒక వీధిలో కల్వర్టు నిర్మా ణంలో ఉపయోగించిన ఇనుప కడ్డీలు బయటకు పొడుచుకొని రావడంతో ప్రమాదకరంగా మారాయని, వాటిని అధికారులు వెంటనే తొలగించాలని నమస్తే తెలంగాణలో ఒక వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో మంగళవారం ఎంపీడీవో రహీం సూచన మేరకు పంచాయతీ సిబ్బంది ఇనుప కడ్డీలను తొలగించారు. సమస్య పరిష్కారం అవడంతో కాలనీవాసులు నమస్తేకు ధన్యవాదాలు తెలిపారు.

నమస్తే ఎఫెక్ట్

## అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సన్మానం



అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్

ఎదులాపురం, మే 14 : ఇటీవల ఆదిలాబాద్ పట్టణ రజక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సంతోష్, వినోద్‌లు ఎన్నికయ్యారు. ఈమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ ఎన్నికైౖ వారిని పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. రజక సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ అన్నారు. సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ట్రాఫిక్ తిప్పలు తప్పేదెట్లా?

- ఖానాపూర్‌లో కానరాని సిగ్నల్స్
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

ఖానాపూర్, మే 14 : ఖానాపూర్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో వాహణదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకునే పాలకులు, అధికారులు లేకపోవడం, రోడ్లు ఇరుకుగా ఉండడంతో సమస్య లు రెట్టింపయినట్లు స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా లారీ అడ్డ వివేకానందా చౌరస్తా, తెలంగాణా చౌరస్తా, పాతబస్టాండ్, విద్యానగర్ ఐబి చౌరస్తాల్లో ట్రాఫిక్ సమస్యలు నిత్యం తీవ్రంగా ఉన్నాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం, ఖానాపూర్ మీదుగా మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు నిత్యం వేల వాహ నాలు వెళ్తుంటాయి. అనుమతులు లేకున్నా భారీ వాహనాలు ఇక్కడి నుంచి వెళ్లడం, తెలంగాణా చౌరస్తా నుంచి ఇంద్రానగర్ వరకు జరగాల్సిన రోడ్డు విస్తరణ పనులు జరుగక పోవడంతో ఈ సమస్య రోజు రోజుకు జఠిలౌమవుతుంది. పాదచారులు రోడ్డు దాటాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులను సకాలంలో పూర్తి చేయాలని, రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు. పోలీసు శాఖ, రవాణ శాఖ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు, వాహణాదారులు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో ప్రజలకు కనీస సౌకర్యాలు చేపట్టడం లేదని స్థానికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన చౌరస్తాల్లో కనీసం హోంగార్డులనైనా నియమించాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు ఖానాపూర్ అభివృద్ధిపై దృష్టి సారించాలని తెలుపుతున్నారు.



ఖానాపూర్ పట్టణంలోని ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యతో నిలిచిపోయిన వాహనాలు

## ఉరేసుకొని యువకుడు మృతి

ఎదులాపురం, మే14 : ఆదిలాబాద్ పట్టణంలోని గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘ భవనంలో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండల కేంద్రమైన సిరికొండకు చెందిన కె.నవీన్(20) జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తూ టీజీవోస్ భవనంలో నివాసం ఉండేవాడు. సోమవారం స్వస్థలానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోని తిరిగి వచ్చాడు. మంగళవారం ఉదయం అతని స్నేహితుడు పవన్ అతడిని కలవటానికి వెళ్లగా అప్పటికే ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుడి ఆరోగ్యం బాగలేదని మనస్థాపం చెంది ఉరేసుకుని మృతి చెందినట్లు వన్ టౌన్ సీఐ కె.సత్యనారాయణ తెలిపారు. తండ్రి లింగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ దామన్ కేసు నమోదు చేశారు.

## ప్రమాదవశాత్తు మృతి

ఎదులాపురం, మే 14 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడకు చెందిన బొల్లు నగేష్(30) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ ఎండీ .ముజాహిద్ తెలిపారు. ఆదిలాబాద్ కచ్‌కంటి సమీపంలోని లేవుట్‌లో వాచ్‌మెన్‌గా పని చేసేవాడు. మంగళవారం ఉదయం ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందినట్లు పేర్కొన్నారు. బొల్లు నగేష్ భార్య బొల్లు మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## యోగా గురువును అభినందించిన ఎమ్మెల్యే



యోగా గురువును సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, మే, 14 : పట్టణంలోని ఎస్ఎస్ జన్నింగ్ ఫ్యాక్టరీలో యోగా గురువు పోతన్నను మంగళవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ అభినందించారు. బెంగుళూరు యోగా యూని వర్సిటీ నుంచి ప్రశంసా పత్రం అందుకున్న పోతన్నను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఇందులో ప్రకాష్, తదితరులు ఉన్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి సాజీద్‌ఉద్దీన్

ఎదులాపురం, మే 14 : గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి మాజీ మంత్రి జోగు రామన్న సారథ్యంలో, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిందని బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి సాజీద్‌ఉద్దీన్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల13న ఖానాపూర్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద మాజీ మంత్రి జోగురామన్నను కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. తమ హయంలో అమలు చేసిన పథకాల ఫలాలను అందిన వారికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ పనితీరు తెలుసని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినప్పటికీ పూర్తి స్థాయిలో గ్యారెంటీలను అమలు చేయకపోవడం వారి అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. కౌన్సిలర్ సలీం, కోఆప్షన్ సభ్యుడు ఏజాజ్, బీఆర్‌ఎస్ నాయకులు అయుబ్, సయ్యద్ అన్సర్, ఎండీ జహూర్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## ఘనంగా సుబ్రమణ్య స్వామి కల్యాణం

నిర్మల్ చైన్‌గేట్, మే, 14 : నిర్మల్ పట్టణంలోని హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం రాత్రి సుబ్రమణ్య స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో అమృత అభిషేకం, షష్టి హోమం, పలు పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ, భక్తులు పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బందిపై దాడి హేయమైన చర్య

నిర్మల్ చైన్‌గేట్, మే, 14 : రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి సమాన రెమ్యూనరేషన్ ఇవ్వాలని నిర్ణయించినప్పట్టికి సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో తక్కువ డబ్బులు ఇస్తూ ఎందుకు తక్కువ ఇస్తున్నారని ప్రశ్నించినందుకు ఉపాధ్యాయులపై లాఠీఛార్జి చేయడాన్ని ఎస్టీయూటీఎస్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. భూమన్నయాదవ్, జె. లక్ష్మణ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

## చర్యలు తీసుకోవాలి

నిర్మల్ టౌన్, మే 14 : ఉపాధ్యాయులపై సంగారెడ్డి జిల్లాలో పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్ నాయక్ మంగళవారం ఒక ప్రకటణలో పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఏపీవోపీవోలకు రెమ్యూనరేషన్‌కు సంబంధించిన జాబితా ఆర్డీ విడుదలైన సందర్భంగా మరి ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క రకంగా పారితోషికం ఇస్తున్నారన్నారు. ఈ విషయంపై నిన్న రాత్రి రాష్ట్ర ఎన్నికల అధికారి, కేంద్ర ఎన్ని కల సంఘానికి మెయిల్ ద్వారా సమాచారాన్ని అందించడం బాధ్యులైన పోలీసు సిబ్బందిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

## మహాలక్ష్మి అమ్మవారికి పూజలు

తాంసి, మే 14 : మండలంలోని పొన్నారిలోని మహాలక్ష్మి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలతో అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. అర్చకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముచ్చ రేఖా రఘు, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ తాజామాజీ సర్పంచ్ అండె అశోక్, బీఆర్‌ఎస్ నాయకులు సిరిగిరి లక్ష్మిపతి ఉన్నారు.

## రిమ్స్‌లో చలివేంద్రం ప్రారంభం

ఎదులాపురం, మే 14 : రిమ్స్ ఎమర్జెన్సీ వార్డు సమీపంలో 'సఫాబైతుల్మాల్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళ వారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ప్రారంభించారు. రోగులు, వారి సహాయకులకు తాగు నీటిని అందించి నిర్వాహ కులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సఫాబైతుల్ మాల్ అధ్యక్షుడు మౌలన సయ్యద్ ముబషిర్, ప్రధాన కార్యదర్శి హఫీజ్‌కసీం, ఉపాధ్యక్షుడు హఫీజ్ బషీర్, కోశాధికారి అబ్దుల్ అజిజ్, సభ్యులు నిసర్, జుబేర్ ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీంపూర్, మే14 : ఆదిలాబాద్ మండలం జందాపూర్ శివారులో 15న బుధవారం 33 కేవీ మిడిల్, డ్యామేజ్ పోల్స్ పనుల కారణంగా భీంపూర్, తాంసి, తలమడుగు మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుం దని ఏఈ శ్రావణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆత్రం సక్కు గెలుపు ఖాయం

తాంసి(తలమడుగు), మే 14 : ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు ఖాయమైందని బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేష్ అన్నారు. మండలంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేతృత్వంలో మండలంలో ముమ్మర ప్రచారం చేశామని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన సేవలకు ఆకర్షితులై ప్రజల నుంచి భారీ స్పందన వచ్చిందన్నారు. మరోవైపు సోషల్ మీడియాలో ఫేక్ సర్వేలు చెక్కర్లు కొడుతున్నాయి.

## విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి





నిరాల, బెర్గావ్‌లో మృతి చెందిన ఆవులు

జైనథ్, మే 14 : మండలంలోని నిరాల గ్రామం బొంద్రె కాశీనాథ్, బెల్గావ్‌కు చెందిన పరదేశి మహేష్ రైతులకు చెందిన ఆవులు మంగళవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందాయి. ఈ విషయంపై రైతు కాశీనాథ్ ఫిర్యాదు మేరకు నిరాల గ్రామ సర్పంచ్ చౌదరి సునంద ప్రభాకర్, గ్రామ కార్యదర్శి రేఖ, విద్యుత్ లైన్‌మెన్ నరేష్, పశు పంచనామా నిర్వహించారు. మృతి చెందిన ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని నిరాల గ్రామస్తులు, రైతులు తెలిపారు.

## ఖుషీ రాథోడ్ రక్తదానం

ఎదులాపురం, మే14 : జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ కూతురు ఖుషీ రాథోడ్ జన్మదినం సందర్భంగా మంగళవారం రిమ్స్‌లో ఆమెతో పాటు పలువురు రక్తదానం చేశారు. అనంతరం రిమ్స్‌లోగల సత్యసాయి నిత్యన్నదానం కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, సినీనటుడు అభినవ్‌సర్దార్, వైద్యఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ , తదితరులు ఉన్నారు.



రక్తదానం చేస్తున్న వైద్యవిద్యార్థి ఖుషీ రాథోడ్

## ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్ టౌన్, మే 14 : కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రవేశల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. పదోతరగతి ఫలితాల్లో ఏడు జీపీ సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్పొరేట్ కళాశాలలో ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత విద్య వసతి సదుపాయం కల్పిస్తుందన్నారు. ఈనెల 30 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు.

## బీజేపీవి మత రాజకీయాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్, మే14 : బీజేపీవి మత రాజకీయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అభ్యర్థి ఆత్రం సుగుణ క్రిస్టియన్ అంటూ బీజేపీ అభ్యర్థి గేడం నగేష్ ప్రచారం చేయడం తగదన్నారు. బీజేపీ మతాలతో రాజకీయం చేస్తూ, దేవుళ్లను అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, నాయకులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్ టౌన్, మే14 : కార్పొరేట్ కళాశాలలో ఇంటర్, ఎంసెట్ కోచింగ్‌లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జీ సజీవన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2024–2025 సంవత్సరానికి గాను రాష్ట్రంలోని కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో 7.0 జీపీఏ మార్కులు, అంతకన్న ఎక్కువ వచ్చిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30 వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాలకుwww. telangana epass.cgg.gov.inలో తెలుసుకోవచ్చుని తెలిపారు.

## సీనియర్ సిటిజన్లకు అభినందనలు

కాగజ్‌నగర్, మే 14: పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్న సిటిజన్లకు సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మంగళవారం అభినందనలు తెలిపారు. ఓటు వేసి బాధ్యతను చాటిచెప్పినందుకు కృతజ్ఞతలు చెప్పారు.